నేడు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రంలో ఇటీవల శాసనమండలిలో ఖాళీ అయిన 8మంది ఎమ్మెల్సీ స్థానాల్లో కొత్త సభ్యులు ఎన్నికయ్యారు. వీరిలో ఎమ్మెల్యే కోటాలో ఐదుగురు, ఉపాధ్యాయ కోటాలో ఇద్దరు, గ్రాడ్యుయేట్ కోటాలో ఒకరు ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. సోమవారం ఉదయం మండలి ఆవరణలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే కోటా కాంగ్రెస్ సభ్యులు అద్దంకి దయాకర్, విజయశాంతి, కేతావత్ శంకర్‌నాయక్, సీపీఐ సభ్యుడు నెల్లికంటి సత్యం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కొమురయ్య, శ్రీపాల్‌రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నారు. బీఆర్ఎస్ సభ్యుడు దాసోజు శ్రవణ్ మరోరోజు ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు మండలి అధికారులు వెల్లడించారు.

దమ్ముంటే బీసీ బిల్లుపై మోదీని ఒప్పించాలి

బండిసంజయ్‌కు మహేశ్‌కుమార్ గౌడ్ సవాల్

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): దమ్ముంటే బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీని ఒప్పించాలని కేంద్రమంత్రి బండి సంజయ్‌కు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. బండిసంజయ్ దిగజారి వ్యాఖ్యలు చేయడం మంచిపద్ధతి కాదని మండిపడ్డారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఢిల్లీ పెద్దలకు భయపడే తెలంగాణ బీజేపీ నేతలు బీసీల ధర్నాకు మొహం చాటేశారని విమర్శించారు. సొంత పార్టీ నేతలే సంజయ్ వైఖరిపై గుర్రుగా ఉన్నారని దుయ్యబట్టారు. కేంద్రమంత్రి అన్న సంగతి మర్చిపోయి దిగజారుడు వ్యాఖ్యలు చేయవద్దని.. బాధ్యత గల కేంద్రమంత్రిగా వ్యవహరించాలని హితవు పలికారు. బండి సంజయ్ ఆదివారం ఉదయం సీఎం రేవంత్ రబ్బరు స్టాంప్ సీఎంలా మారారని వ్యాఖ్యానించారు. క్యాబినెట్ విస్తరణ ఏఐసీసీ చేతిలో ఉండటమేంటని, సచివాలయం నుంచి ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రివ్యూ చేయడమేంటని ప్రశ్నించారు.

పరిహారం తేలకుండానే పంపిణీకి ఏర్పాట్లు

- రైతులు వ్యతిరేకిస్తున్నా వెనక్కు తగ్గని ఎన్‌హెచ్ఏఐ
- సొమ్మును కోర్టులో జమచేసి భూములను స్వాధీనం చేసుకునేందుకు సన్నాహాలు
- మరో లగచర్లలా మారనున్న ట్రిపుల్ ఆర్ భూసేకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ఆర్) ఉత్తర భాగం భూ నిర్వాసితులకు ఎంత నష్టపరిహారం చెల్లించాలో తేలకుండానే ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం పరిహారం చెల్లించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇవ్వజూపిన పరిహారం మార్కెట్ ధరలో సగం కూడా లేకపోవడంతో రైతులు ఒప్పుకోవడంలేదు. దీంతో నష్టపరిహారం మొత్తాన్ని కోర్టులో జమచేసి బలవంతంగా భూములు స్వాధీనం చేసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఫలితంగా ట్రిపుల్ఆర్ భూసేకరణ వ్యవహారం మరో లగచర్లలా మారవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 162 కిలోమీటర్ల పొడవైన ట్రిపుల్ఆర్ ఉత్తర భాగం కోసం 1,950 హెక్టార్ల భూములు సేకరిస్తున్నారు. ఆ భూములతోపాటు ఇతర ఆస్తులకు సంబంధించి నిర్వాసితులకు రూ.5,100 కోట్ల నష్టపరిహారం అందజేయాల్సి ఉంటుందని అంచనా. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాల్సి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.2,550 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1,250కోట్లు కేటాయించారు. భూసేకరణ 85% మేరకు పూర్తయిందని, అవార్డులు పాస్ చేశామని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించాయి. ప్రస్తుతం నిర్ధారిత నష్ట పరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమచేసేందుకు ఎన్‌హెచ్ఏఐ సన్నాహాలు చేస్తున్నది. అయితే, మార్కెట్ ధర ప్రకారం తొలుత ఎకరాకు రూ.6 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని నిర్ధారించడంతో రైతులు వ్యతిరేకించారు. దీంతో ప్రభుత్వం భూముల ధరలను సవరించడంతోపాటు సరైన నష్టపరిహారాన్ని నిర్ధారించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆర్బిట్రేషన్‌ను ఏర్పాటు చేసింది. ట్రిపుల్ఆర్ నిర్మించే ప్రాంతాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు పలుకుతుండగా.. ప్రభుత్వం మాత్రం గరిష్ఠంగా రూ.12-15 లక్షల నష్ట పరిహారం ఇచ్చేందుకు ముందుకొచ్చింది. దీన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు, అవార్డు పాస్‌చేసిన భూములకు నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్ఏఐ సిద్ధమవున్నది. ఒకవేళ రైతులు నష్టపరిహారం తీసుకునేందుకు నిరాకరిస్తే ఆ సొమ్మును కోర్టులో జమచేసి మ్యుటేషన్ (అధికారికంగా భూములు తమ ఆధీనంలోకి తీసుకోవడం) చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

బహిరంగ మార్కెట్ ధర ప్రకారమే చెల్లించాలి..

బహిరంగ మార్కెట్ ధర ప్రకారమే తమకు నష్టపరిహారం చెల్లించాలని ట్రిపుల్ఆర్ భూనిర్వాసితులు కోరుతున్నారు. లేకుంటే తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదని స్పష్టం చేస్తున్నారు. తమను సంప్రదించకుండానే ఎన్‌హెచ్ఏఐ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి అవార్డులు పాస్ చేశాయని, ఇప్పుడు నష్టపరిహారం చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని వారు వాపోతున్నారు. దీనిపై ఇప్పటికే కొందరు రైతులు న్యాయ పోరాటానికి దిగడంతో కోర్టు స్టే విధించింది. ట్రిపుల్ఆర్‌ను తమ భూముల మీదుగా వెళ్లకుండా చూస్తామని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చారని రాయగిరి, యాదాద్రి ప్రాంతాలకు చెందిన రైతులు గుర్తుచేస్తున్నారు. కానీ, ప్రభుత్వం మాత్రం పోలీసుల సహకారంతో బలప్రయోగం ద్వారా అయినా తమ భూములను స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ అదే జరిగితే లగచర్ల తరహా ఘటన పునరావృతమవుతుందని హెచ్చరిస్తున్నారు. ట్రిపుల్ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి ఇదివరకే టెండర్లను ఆహ్వానించినప్పటికీ కోర్టు కేసులు తేలకపోవడంతోపాటు పర్యావరణ అనుమతుల కారణంతో వాటిని ఇంకా తెరవలేదు. అయితే, తాజాగా పర్యావరణ అనుమతులు లభించినట్టు అధికారులు తెలిపారు. కోర్టు కేసులు కూడా త్వరలోనే పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నష్టపరిహారం విషయంలో రైతులు ఒప్పుకోకుంటే ఆ మొత్తాన్ని కోర్టులో జమచేసి పనులు చేపట్టే ఆస్కారముందని వారు చెప్తున్నారు.

సీతారామచంద్రస్వామికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు, దేవాదాయశాఖ మంత్రి సురేఖ

కల్యాణం.. కమనీయం

- భద్రాచలంలో నేత్రపర్వంగా సీతారాముల పరిణయం
- భక్తజనసంద్రంగా భద్రగిరి మిథిలా స్టేడియం

ఖమ్మం, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలంలో ఆదివారం సీతారామచంద్రస్వామి కల్యాణమహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కల్యాణ క్రతువు మధ్యాహ్నం 12:30 గంటల వరకు కొనసాగింది. పెండ్లి కుమారుడిగా శ్రీరామచంద్రుడు, పెండ్లికుమార్తెగా సీతమ్మ తల్లి ఆశీనులైన మిథిలా నగరం (స్టేడియం) వైకుంఠాన్ని తలపించింది.

3 మంగళసూత్రాలతో మాంగళ్యధారణ

సీతమ్మకు కల్యాణం రోజున దేశంలో ఎక్కడైనా రెండు మంగళసూత్రాలు మాత్రమే ధరింపచేస్తారు. కానీ, భద్రాచలంలో మాత్రం మూడు మంగళసూత్రాలు ఉంటాయి. ఒకటి జనకమహారాజు చేయించినది కాగా, రెండోది దశరథమహారాజు చేయించినది. ఇక మూడోది భక్తరామదాసు సీతమ్మను తన కూతురుగా భావించి చేయించినది.

పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

శ్రీరామచంద్రుడు, సీతమ్మకి ప్రభుత్వం తరపున సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దంపతులు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులు ఫుల్.. సౌకర్యాలు నిల్

తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కానీ, వారికి సరిపడా వసతులు, స్నానఘట్టాలు ఏర్పాటుచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

టీజీపీఎస్సీలో మిగిలింది ముగ్గురే!

- ఇప్పటికే ఒక సభ్యురాలి పదవీ విరమణ
- ఈ నెలలో మరో సభ్యుడి రిటైర్మెంట్
- కమిషన్‌లో ఏడు పోస్టులు ఖాళీ

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) దాదాపు ఖాళీ అయ్యింది. ప్రస్తుతానికి కమిషన్ చైర్మన్ సహా ముగ్గురు సభ్యులే మిగిలారు. ఇప్పటికే ఒక సభ్యురాలు పదవీ విరమణ పొందగా, ఈ నెలలో మరో సభ్యుడు రిటైర్మెంట్ కానున్నారు. దీంతో కమిషన్‌లో సభ్యుల పోస్టులు ఏడు ఖాళీగా ఉన్నాయి. చట్టం ప్రకారం కమిషన్ చైర్మన్‌తోపాటు 10 మంది సభ్యులను నియమించుకోవచ్చు. కానీ, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ సర్కారు పాత కమిషన్ సభ్యుల చేత రాజీనామా చేయించింది. ఆ తర్వాత చైర్మన్‌తో సహా ఐదుగురు సభ్యులను మాత్రమే నియమించింది. సభ్యులుగా నియమితులైనవారు గరిష్ఠంగా ఆరేండ్లు లేదా 62 ఏండ్ల వయసు వరకు పదవిలో ఉండవచ్చు. కాంగ్రెస్ నియమించిన సభ్యుల్లో అనితారాజేంద్ర పదవీ విరమణ పొందారు. ఈ నెలలో మరో సభ్యుడు రామ్మోహన్‌రావు పదవీ విరమణ పొందనున్నారు. వచ్చే ఏడాది ప్రొఫెసర్ నర్రి యాదయ్య పదవీ విరమణ పొందుతారు. దీంతో అమీరుల్లాఖాన్, పాల్వాయి రజనీకుమారి మాత్రమే ఎక్కువకాలం పదవిలో ఉండనున్నారు.

ప్రక్షాళన అంటూ ప్రగల్భాలు..

బీఆర్ఎస్ హయంలో నియమించిన కమిషన్ చైర్మన్, సభ్యులతో కాంగ్రెస్ సర్కారు రాజీనామాలు చేయించింది. దీనిని కాంగ్రెస్ పెద్దలు ప్రక్షాళన అని గొప్పలు చెప్పుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు 'ఉద్యోగాలు భర్తీచేసే కమిషనే ఖాళీగా ఉంది.. వీళ్లేం ఉద్యోగాలు భర్తీ చేస్తారు' అని ఆ పార్టీ నేతలు వ్యంగ్యంగా మాట్లాడారు. తీరా అధికారంలోకి వచ్చాక ఒక చైర్మన్ సహా ఐదుగురు సభ్యులను మాత్రమే నియమించింది. మరో ఐదుగురిని నియమించకుండానే వదిలేసింది. అధికారం లేనప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించడం గమనార్హం. ప్రక్షాళన అంటే ఇదేనా? ముగ్గురు సభ్యులతో కమిషన్ నడపడమేనా? అంటూ నిరుద్యోగులు నిలదీస్తున్నారు.

టీచర్ల భర్తీలో అక్రమాలపై విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : టీచర్ ఉద్యోగాల్లో అక్రమాలపై విద్యాశాఖ స్పందించింది. ఈ అంశంపై ప్రాథమిక విచారణకు ఆదేశించింది. 2002 డీఎస్సీ బాధితులకు టీచర్ ఉద్యోగాలిచ్చేందుకు విద్యాశాఖ డైరెక్టరేట్‌లోని కొందరు అధికారులు లంచాలు డిమాండ్ చేశారని బాధితులు ఆరోపించారు. ఇదే అంశంపై 'నమస్తే తెలంగాణ'లో 'ఐదు లక్షలిస్తేనే టీచర్ ఉద్యోగం' శీర్షికతో ఆదివారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు ప్రాథమిక విచారణకు ఆదేశించారు.

- బీఆర్ఎస్, వామపక్ష నేతల ముందస్తు అరెస్టు

సీతారాముల కల్యాణానికి సీఎం రేవంత్ హాజరైన నేపథ్యంలో బీఆర్ఎస్ సహా సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, మాలమహానాడు నాయకులను శనివారం అర్ధరాత్రి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. గ్యారెంటీ హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీస్తారని, సీఎం కాన్వాయ్‌ను అడ్డుకుంటారేమోననే అనుమానాలతో వారిని అదుపులోకి తీసుకుని పాల్వంచ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. - బూర్గంపహాడ్

పనికి తగిన కూలి ఏది?

- ఉపాధి హామీ కూలీల శ్రమ దోపిడీ
- రూ.307 వేతనం పెంపుతో ఒరిగేదేమీ లేదు
- నిరుడు సగటున దక్కింది రూ.271 మాత్రమే
- ప్రభుత్వం గొప్పల కోసమే కూలి పెంపు నిర్ణయం
- పని పరిమాణం తగ్గిస్తేనే కూలీలకు ప్రయోజనం

నిరుడు దక్కింది రూ.271 మాత్రమే..

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనుల పరిమాణం తగ్గించకుండా కేంద్రం శ్రమ దోపిడీకి పాల్పడుతున్నది. గొప్పలు చెప్పుకొనేందుకే కూలీల దినసరి వేతనాన్ని పెంచుతున్నట్టు ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కార్మిక చట్టాల ప్రకారం రోజుకు సగటున రూ.300 పైగా చెల్లించామని చెప్పింది. కానీ, వాస్తవానికి సగటున కేవలం రూ.271 మాత్రమే దక్కింది. తాజాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉపాధి హామీ కూలీల రోజువారీ వేతనాన్ని రూ.300 నుంచి రూ.307కు పెంచింది. ఈ నిర్ణయంతో ఒరిగేదేమీలేదని కార్మిక సంఘాలు పెదవి విరుస్తున్నాయి. పేదలైన కూలీలకు మేలు జరుగాలంటే పనిరేటు పెంచి పని పరిణామాన్ని తగ్గించాలని పేర్కొంటున్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీల వేతనాన్ని రూ.300గా నిర్ణయించారు. సగటున లభించింది మాత్రం రూ.271 మాత్రమే. చెరువుల్లో పూడికతీతకు సంబంధించి ఒక క్యూబిక్ మీటర్ పనిచేయాల్సి ఉంటుంది. ఇద్దరు కూలీలు కలిసి సుమారు ఒక ట్రాక్టర్ మట్టిని ఎత్తిపోయాల్సి వస్తుంది. అప్పుడు మాత్రమే వారికి ప్రస్తుత వేతనం ప్రకారం రూ.307 దక్కుతుంది. కానీ, మండుటెండలో పొడిబారిన భూమిని తవ్వడం, ఒక్కరోజులో అంత పని పూర్తిచేయడం అసాధ్యమని కూలీలు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో నిరుడు నిర్ణీత కూలికి రూ.29 తక్కువగా లభించిందని చెబుతున్నారు. ఇప్పుడు కేంద్రం రూ.307 వరకు వేతనం పెంచినా ఫలితం ఉండబోదని స్పష్టం చేస్తున్నారు.

రోజువారీ పనిని తగ్గించాలి

ఉపాధి హామీ పథకం కింద వేతనం పెంచినంత మాత్రాన కూలీలకు మేలు జరుగదు. రోజువారీగా చేసే పనిని తగ్గించాలి. అప్పుడే కూలీలకు గిట్టుబాటు అవుతుంది. అలాగే 15 రోజులకోసారి వేతనాలు చెల్లించాలి. పనిచేసే ప్రాంతాల్లో మెరుగైన వసతులు కల్పించాలి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలి. పని పరిమాణాన్ని తగ్గించి హర్యానాలో మాదిరిగా రూ.400 కూలి చెల్లించాలి.

– మేకల రవి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఇతర రంగాల వైపు కూలీలు..

రోజువారీ పని పరిమాణాన్ని తగ్గించినప్పుడే ఉపాధి కూలీలకు లబ్ధి చేకూరుతుంది. క్యూబిక్ మీటర్‌ను 0.75 మీటర్‌కు తగ్గించాలని కోరుతున్నారు. అప్పుడే ఒక్కరోజు పనికి పూర్తివేతనం పొందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పని పరిమాణం తగ్గించకపోవడంతో అధికంగా కూలి లభించే వ్యవసాయం, తాపీ తదితర పనులకు వెళ్తున్నారని, వెరసి ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆరోపిస్తున్నారు.

ఎస్ఎల్‌బీసీ.. ఏం చేద్దాం..?

- బైపాస్ టన్నెల్ నిర్మాణం అసాధ్యం!
- ఆడిట్ ఏర్పాటూ అంత సులువేం కాదు..
- అదనపు ఖర్చు.. మరింత సమయం
- ప్రభుత్వానికి తేల్చిచెప్పిన నిపుణులు
- అవుట్‌లెట్ వైపు నుంచే టీబీఎంతోనే ముందుకెళ్లాలి
- మార్గంలో మరిన్ని షీర్ జోన్లు
- లేదంటే డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ మెథడ్
- అదీ కూడా కత్తిమీద సామే

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మినీ జేసీబీతో శకలాలను, మట్టిని తొలగిస్తున్న దృశ్యం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ నిర్మాణాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని సర్కారు తర్జనభర్జన పడుతున్నది. ప్రమాదకర ప్రాంతాన్ని తప్పిస్తూ బైపాస్ సొరంగాన్ని చేపడితే ఎలా ఉంటుందనే ఆలోచన చేసినా అది అసాధ్యమని నిపుణులు తేల్చారు. సొరంగానికి ఆడిట్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని భావించినా అది అదనపు ఖర్చుతోపాటు మరింత సమయం పడుతుందని పేర్కొన్నారు. సొరంగాన్ని త్వరగా పూర్తి చేసేందుకు డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ మెథడ్(డీబీఎం) ఒక్కటే సరైన మార్గమని, అయితే అనుమతులు తీసుకోవడమే గాక, పనుల నిర్వహణ కూడా కత్తిమీద సాములాంటిదేనని వివరించారు. ఎట్టకేలకు అవుట్‌లెట్ వైపు నుంచి టీబీఎంతో యథావిధిగా పనులు కొనసాగించాలని నిర్ణయించినా పనులు జాప్యమయ్యే అవకాశముందని సమాచారం. దీంతో ఇప్పుడేం చేయాలా? అని సర్కారు డైలమాలో పడినట్టు తెలుస్తున్నది.

టన్నెల్ బైపాస్ అసాధ్యం..

శ్రీశైలం రిజర్వాయర్ నుంచి దిండి రిజర్వాయర్ వరకు 43.50 కి.మీ సొరంగాన్ని తవ్వాల్సి ఉంది. ఏకకాలంలో రెండువైపుల నుంచి సొరంగం పనులు చేపట్టారు. ఇన్‌లెట్ అంటే అచ్చంపేట మండలం దోమలపెంట వద్ద శ్రీశైలం రిజర్వాయర్ గట్టు నుంచి, అవుట్‌లెట్ అంటే మహబూబ్‌నగర్ జిల్లా మన్యవారిపల్లె నుంచి సొరంగం పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రెండువైపుల కలిపి 34.372 కి.మీ సొరంగం పనులు పూర్తికాగా, ఇంకా 9.560 కి.మీ మేర తవ్వాల్సి ఉంది. ఇన్‌లెట్ టన్నెల్‌లో 13.93కి.మీ వద్ద అత్యంత సున్నితమైన షీర్ (పగులువారి వదులైన రాతిపొరలు) జోన్ వద్ద భారీ నీటి ఊటల నేపథ్యంలో టన్నెల్ పైకప్పు కూలిపోయి 8మంది కార్మికులు మృతి చెందారు. ప్రస్తుతం మృతదేహాల వెలికితీతకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. టన్నెల్ పనులను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై ప్రభుత్వ పెద్దలు ఇటీవల పలువురు నిపుణులు, ఏజెన్సీ ప్రతినిధులతో చర్చించారు. ప్రస్తుతం ప్రమాదం సంభవించిన చోటున ఉన్న షీర్ జోన్‌ను పక్కకు తప్పిస్తూ టన్నెల్‌ను బైపాస్ చేయాలని ఆలోచన చేశారు. కొద్దిదూరం ముందుకు తీసుకెళ్లిన అనంతరం యథావిధిగా ప్రధాన టన్నెల్ మార్గానికి అనుసంధానిస్తే బావుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. ఆచరణలో అది అసాధ్యమని ఏజెన్సీకి చెందిన విదేశీ నిపుణులు ప్రభుత్వానికి తేల్చిచెప్పినట్టు సమాచారం. అదీగాక టన్నెల్ అలైన్‌మెంట్ మార్గంలో మరో 4షీర్ జోన్లు కూడా ఉన్నాయని, అక్కడా ఇలాంటి పరిస్థితే ఎదురుకాదని చెప్పలేమని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగానికి ఇప్పటికీ ఒక్క ఆడిట్ పాయింట్ అనేది లేదు. ఉపరితలంలో దట్టమైన అభయారణ్యం విస్తరించి ఉండడమే కారణం. ఆడిట్ పాయింట్ అంటే టన్నెల్ తవ్వకంలో వచ్చే రాళ్లు, మట్టి తరలింపు, రవాణా అవసరాల కోసం, లోపలికి ఆక్సిజన్, వెలుతురు కోసం సొరంగానికి ఏర్పాటు చేసే అదనపు మార్గం. ప్రస్తుతం అమ్రాబాద్ మండలం తిర్మలాపూర్ వద్ద నుంచి ఆడిట్ ఏర్పాటుకు అవకాశమున్నదని సర్కారు భావిస్తున్నది. దానిని కూడా నిపుణులు తోసిపుచ్చినట్టు సమాచారం. తిర్మలాపూర్ నుంచి ఎస్ఎల్‌బీసీ సొరంగం వరకు 5కి.మీ దూరం ఉంటుందని, ఆ మేరకు ఆడిట్ సొరంగాన్ని తవ్వాల్సి ఉంటుందని, అదనపు ఖర్చు అని, టన్నెల్ నుంచి వెలికితీసిన మట్టి, రాళ్లను ఆడిట్‌పాయింట్ నుంచి బయటకు తరలించినా, వాటిని నిల్వచేసేందుకు భారీగా భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని వివరించినట్టు సమాచారం. ఆడిట్‌పాయింట్ ఏర్పాటును ఆదిలోనే విరమించుకున్నారని తెలిసింది.

డైలమాలో సర్కారు..!

ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకాన్ని టీబీఎం (టన్నెట్ బోరింగ్ మిషన్) ద్వారా కొనసాగిస్తున్నారు. ఆ టీబీఎం ఏర్పాటు చేసి 20ఏండ్లు కాగా, సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. గంటకు 2.5మీటర్లు బోరింగ్ చేయాల్సిన టీబీఎం సామర్థ్యం రోజుకు గరిష్ఠంగా 5 మీటర్లు కూడా దాటని పరిస్థితి ఏర్పడింది. భారీగా నీటి ఊట రావడం సవాలుగా నిలిచింది. ప్రమాదంలో ఆ టీబీఎం పూర్తిగా దెబ్బతిన్నట్టు తెలుస్తున్నది. కొత్త టీబీఎం ఏర్పాటుకు రూ. 300-400కోట్ల మేర నిధులు కావడమేగాక, దానిని విదేశాల నుంచి తెప్పించడానికి ఏడాది పట్టే అవకాశమున్నది. దీంతో ప్రస్తుతం డీబీఎం (డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ మెథడ్) విధానం ఒక్కటే శరణ్యమని నిపుణులు సర్కారుకు సూచించినట్టు తెలిసింది. అభయారణ్యాన్ని దృష్టిలో పెట్టుకుని భూప్రకంపనలు లేకుండా చూసుకోవాల్సి ఉంటుందని, శబ్దం 50 డెసిబుల్స్ దాటకూడదనే కేంద్రం షరతులకు లోబడి పనులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. టీబీఎం టెక్నాలజీలో ఆటోమేటిక్‌గా మ్యూక్‌ను(వ్యర్థాలను) కన్వేయర్ బెల్ట్ నుంచి బయటకు పంపే అవకాశముండగా, డీబీఎంలో మాన్యువల్‌గా తరలించాల్సి ఉంటుంది. ఆడిట్ పాయింట్ ఉంటేనే డీబీఎం విధానంలో సొరంగం తవ్వకం సులువని, లేదంటే అదీ అసాధ్యమేనని చెప్పినట్టు సమాచారం. చివరగా ఇన్‌లెట్ పనులన్నీ నిలిపివేసి, అవుట్‌లెట్ నుంచే టన్నెల్ పనులను కొనసాగించవచ్చని, సొరంగం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశమున్నదని తెలిపినట్టు తెలిసింది. నిపుణులు, ఇంజినీర్లు వెల్లడించిన అభిప్రాయాల నేపథ్యంలో సర్కారు పూర్తిగా డైలమాలో పడింది. ఎస్ఎల్‌బీసీని ఏం చేద్దాం? పనుల విషయంలో ఎలా ముందుకు వెళ్లాలి? అనే అంశాలపై తర్జనభర్జన పడుతున్నది.

కొనసాగుతున్న సహాయక చర్యలు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 6 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం దోమలపెంట ఎల్ఎల్‌బీసీలో చిక్కుకున్న ఆరుగురి కార్మికుల మృతదేహాల కోసం అన్వేషణ కొనసాగుతున్నది. మినీ జేసీబీ సహాయంతో లోకోట్రైన్, టీబీఎం మిషన్ కటింగ్ చేసిన శకలాలను బయటకు తరలించారు. ఆదివారం టన్నెల్ ప్రత్యేకాధికారి శివశంకర్ రెస్క్యూ బృందాల ప్రతినిధులతో మరోసారి సమీక్ష నిర్వహించారు.

హ్యామ్ రోడ్లపై బ్రిడ్జీల నిర్మాణం ఎలా?

- పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరించాలంటున్న ఏజెన్సీలు
- బీఆర్ఎస్ హయాంలో 100కుపైగా బ్రిడ్జీల నిర్మాణం
- రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద 50కిపైగా ఆర్వోబీలు ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): రోడ్ల నిర్మాణానికి అడ్డొచ్చే వాగులు, కాలువపై కల్వర్టులు, వంతెనల నిర్మాణం తప్పనిసరి. వాస్తవానికి రోడ్డు నిర్మాణం కన్నా వీటి నిర్మాణానికే ఎక్కువ ఖర్చవుతున్నది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్ విధానం)లో చేపట్టే ఈ రోడ్ల నిర్మాణంలో బ్రిడ్జీల నిర్మాణం సమస్యగా మారింది. వీటి నిర్మాణానికయ్యే అదనపు ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరించాలని ఏజెన్సీలు కోరుతున్నాయి. కానీ, రోడ్ల నిర్మాణం తరహాలో బ్రిడ్జీల నిర్మాణ ఖర్చును ప్రభుత్వం 40%, ఏజెన్సీలు 60% చొప్పున భరించాలని ప్రభుత్వం చెప్తున్నది. రాష్ట్రంలో 2028 నాటికి రూ.28 వేల కోట్ల వ్యయంతో 17 వేల కి.మీ గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. విధివిధానాల రూపకల్పనపై ప్రైవేటు ఏజెన్సీలతో చర్చలు జరుపుతున్నది. ఈ విధానంల